నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I హైదరాబాద్, మంగళవారం 25 ఫిబ్రవరి 2025 YADADRI BHUVANAGIRI


## ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీఎంకు పోస్టు కార్డులు



సీఎం రాసిన ఉత్తరాలు చూపుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

నల్లగొండ, ఫిబ్రవరి 24: ఎన్నికల సందర్భంగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని అందించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి కట్టా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం పోస్టు కార్డులు పంపించారు. అంతకు ముందు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పోస్టు కార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆ తర్వాత వాటిని నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ కారులకు ఇస్తానన్న 250 గజాల స్థలాన్ని వెంటనే అందించాలని, లేని పక్షంలో అడుగడుగునా నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, వెంకన్న, జావెద్, శ్రీను పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నేటితో బంద్

## సాయంత్రం 4 గంటలకు తెర

- ఈ నెల 27 వరకు మద్యం దుకాణాలు మూత
- బల్క్ ఎస్ఎంఎస్‌లు నిషేధం.. అమలులోకి 144 సెక్షన్
- హోరాహోరీగా సాగిన ప్రచారం
- ప్రలోభ పర్వంపై పలువురు అభ్యర్థుల దృష్టి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : కలెక్టర్ ఇలా త్రిపాఠి



వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల ప్రచారానికి మంగళవారంతో తెరపడనుంది. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ ముగిసే సమయానికి సరిగ్గా 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాల్సి ఉంటుంది. ఈ నెల 27 సాయంత్రం 4గంటలకు పోలింగ్ ముగియనుండడంతో నేటి సాయంత్రం 4 గంటల నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగబోనున్నది. ఆ తర్వాత ఓటర్లను మచ్చిక చేసుకునే క్రమంలో అభ్యర్థులు ప్రలోభాలకు తెరలేపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధాన పార్టీతోపాటు సంఘాలు బలపర్చిన అభ్యర్థులు మంగళవారం సాయంత్రం నుంచి పోలింగ్ రోజు వరకు ఓటర్లకు మరింత దగ్గర అయ్యేందుకు కావాల్సిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్లు చర్చ సాగుతున్నది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి బహుముఖ పోటీ నెలకొనడంతో గెలుపు కోసం చివరి క్షణం వరకు ఏవరు ఏం ఎత్తుగడలు వేస్తారోనన్నది ఆసక్తికరంగా మారింది.

*– నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ)*

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నది. ఈసారి బరిలో నిలిచిన అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతోపాటు ప్రధాన అభ్యర్థుల సంఖ్య కూడా పెరుగడ పాటు ప్రచారం కూడా హోరెత్తుతున్నది. మొత్తం ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు నిలిచారు. ఇందులో ప్రధాన పార్టీ, సంఘాల అభ్యర్థులు ఓటర్ల నమోదు నుంచే రంగంలోకి దిగగా కొందరు మాత్రం నామినేషన్ల అనంతరం ప్రచారాన్ని ప్రారంభించారు. నియోజకవర్గం విస్తృతి చాలా పెద్దది అవడంతో ముందు నుంచే ప్రధాన సంఘాల అభ్యర్థులు అన్ని మండలాలను కవర్ చేయాలన్న ప్లాన్‌తో ప్రచారం నిర్వహించారు. పది రోజులుగా క్షేత్రస్థాయి ప్రచారంతోపాటు సోషల్ మీడియాలో సైతం ప్రచారాన్ని విపరీతంగా నిర్వహిస్తున్నారు. అధ్యాపకులు, ఉపాధ్యాయుల సమస్యలు, వాటికి పరిష్కారాలు, ఇప్పటివరకు తమ సంఘాల ఆధ్వర్యంలో సాధించిన ఫలితాలు, రానున్న కాలంలో తాము కేంద్రీకరించే అంశాలు తదితర అంశాలే ప్రచారంలో ప్రధాన అస్త్రాలుగా నిలిచాయి. ఈ క్రమంలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోరుపై తీవ్ర ఉత్కంఠత నెలకొంది. ఈ ఎన్నికల్లో 12 జిల్లాల పరిధిలోని 25,797మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటర్లుగా ఉన్నారు.

### ప్రధాన సంఘాల మధ్యే పోటీ

ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు ఈ ఎన్నికలను తొలి నుంచి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. బరిలో మొత్తం 19 మంది అభ్యర్థులు ఉన్నా... ఐదారుగురు ప్రధాన అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొందన్న అభిప్రాయాలున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్సీ, టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డి, బీసీ సంఘాల నుంచి టీచర్స్ జాక్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీసీసీ అధికార ప్రతినిధి, మాజీ పీఆర్‌టీయూ నేత గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రధాన సంఘాల నుంచి బరిలో నిలిచారు. దాంతో ఆయా సంఘాల బలాబలాలు, సామాజిక అంశాల ఆధారంగా వారంతా గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రతి ఓటరునూ కలిసేలా ప్లాన్ చేసుకుని రంగంలోకి దిగారు. అందరూ నియోజకవర్గం పరిధిలోని ప్రతి మండలంలో ప్రచారం నిర్వహించేలా జాగ్రత్త పడ్డారు. అభ్యర్థులు స్వయంగా ప్రచారం చేయడంతోపాటు ఆయా సంఘాల బాధ్యులు కూడా మండలాల వారీగా ఓటర్లను పంచుకుని రోజూ టచ్‌లో ఉంటూ వస్తున్నారు. ఇప్పటికే ప్రధాన అభ్యర్థులంతా తమ బలాబలాలపై ఓ అంచనాకు వచ్చి గెలుపునకు అవసరమైన ఓటర్లను తమ వైపు తిప్పుకొనేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా చివరి ప్రధాన అస్త్రాలుగా ప్రలోభాలకు సైతం తెరపేందుకు సిద్ధమైనట్లు సమాచారం. మంగళవారం సాయంత్రం 4 గంటలకు అధికారికంగా ప్రచారం ముగియనుండడంతో తర్వాత ఓటర్లను కచ్చితంగా తమ వైపు తిప్పుకొనేందుకు కావాల్సిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం సాగుతున్నంది.

### 4గంటల తర్వాత నో చాన్స్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 4 గంటలకు ముగియనుంది. ఈ నెల 27న పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో నేటి నుంచి సైలెన్స్ పీరియడ్ అమల్లోకి రానుంది. సాయంత్రం 4 గంటల నుంచి బహిరంగ సభలు, ర్యాలీలు, సమావేశాల ద్వారా ప్రచారం నిషేధం. అభ్యంతకర, రాజకీయపర అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్ పంపడంపైనా ఎన్నికల సంఘం నిషేధం విధించింది. పోలింగ్ ముగిసే వరకు ఎన్నికల నిబంధనల ప్రకారం నియోజకవర్గవ్యాప్తంగా 144సెక్షన్ కూడా అమలులోకి రానుంది. ఈ 48 గంటలపాటు ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాలో మద్యం దుకాణాలు బంద్ చేయనున్నారు. రెండు రోజుల్లో సాధారణ మద్యం షాపులతోపాటు ఇతర రకాల మద్యం అమ్మకాలకు లైసెన్స్ పొందిన వారు కూడా అమ్మకాలు చేయడం లేదా సర్వ్ చేయడంపై నిషేధం విధించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రజాప్రాతినిధ్యం చట్టం 1951, ఎన్నికల నియమావళి 1961 ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని నల్లగొండ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి హెచ్చరించారు. ఈ 48 గంటల సమయంలో ఇతర జిల్లాలకు చెందిన వారు జిల్లాలో ఉండవద్దని సూచించారు. ఈ సమయంలో మద్యం ఎక్కడ అమ్మినా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. వచ్చే నెల మూడున కూడా నల్లగొండ మున్సిపాలిటీలో మద్యం దుకాణాలు బంద్ చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.

## ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం



పెర్కకొండారంలో కవితకు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

శాలిగౌరారం, ఫిబ్రవరి 24 : మహబూబాబాద్ పర్యటనకు వెళ్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సోమవారం మండలంలోని పెర్కకొండారం గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కవిత కూడా వాహనం దిగి కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించి నమస్కరించారు. బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని స్థానిక నాయకులతో అన్నారు. స్వాగతం పలికిన వారిలో బీఆర్‌ఎస్ మాజీ మండలాధ్యక్షుడు కట్టా వెంకట్‌రెడ్డి, దుబ్బ వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు యామగాని వెంకన్నగౌడ్, నూక జానయ్యయాదవ్, మాచర్ల అంజయ్య, దేవరకొండ సైదులు, గుండెబోయిన రాజ్‌కుమార్ ఉన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బొబ్బిలి జాన్‌యాదవ్, అనంతుల వెంకన్న ఎమ్మెల్సీ కవిత సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

## గుట్ట అభివృద్ధిపై రేవంత్‌కు చిత్తశుద్ధి లేదు

- మూడుసార్లు వచ్చినా అభివృద్ధిపై నోరు మెదుపని ముఖ్యమంత్రి
- స్వర్ణగోపురం మహాకుంభాభిషేక సంప్రోక్షణలో స్తపతులకు అవమానం
- పెండింగ్ పనుల పూర్తిపై దృష్టి పెట్టాలి
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 24 : యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో గుట్టకు మూడుసార్లు వచ్చినా అభివృద్ధిపై నోరు మెదుపలేదని మండిపడ్డారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం మీడియాతో ఆమె మాట్లాడారు. లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం దివ్య విమాన గోపురం మహాకుంభ సంప్రోక్షణ శాస్త్రపరంగా జరుగలేదన్నారు. దేవాదాయ శాఖ మంత్రి, జిల్లా మంత్రులు లేకుండానే సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరే హాజరై స్వర్ణ విమానగోపురాన్ని ప్రారంభించారని తెలిపారు. దేశానికే తలమానికంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ రూ.1,300 కోట్లతో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. పూర్తి కృష్ణశిల కూడిన అద్భుతమైన నిర్మాణమని ఆస్ట్రేలియా దేశం గ్రీన్ ఆపిల్ అవార్డు ప్రకటించిందని తెలిపారు. పట్టణంలో కొందరికి ఇబ్బంది కలిగినా చుట్టూ రహదారులు, కొండ కింద పుష్కరిణి, గండిచెరువు, సత్యనారాయణ వ్రత మండపం, పార్కింగ్, చుట్టూ రహదారులతోపాటు భక్తులకు అవసరమైన అన్ని వసతులు బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కల్పించిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్వామివారి ఆదాయాన్ని ఇతర అవసరాలను వినియోగించారే తప్ప ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచన ఎవరికీ రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 15 నెలల కావస్తున్నా గుట్ట అభివృద్ధిపై ఒక్క సమీక్ష కూడా జరుపలేదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఆలయ పునఃప్రారంభోత్సవ సమయంలో జరిగిన మహా కుంభ సంప్రోక్షణ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్లతోపాటు పార్టీలకతీతంగా అందరినీ ఆహ్వానించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఆలయ పునర్నిర్మాణంలో ఆహోరాత్రులు శ్రమించిన ప్రధాన స్తపతి సుందరరాజన్, స్తపతి సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ ఆనందాచార్యుల వేలు, డిప్యూటీ స్తపతి మోతీలాల్‌తోపాటు 13 మంది ఇతర డిప్యూటీ స్తపతులకు స్వర్ణ విమానగోపురం పునఃప్రారంభోత్సవ ఆహ్వానం లేకపోవడం దారుణమన్నారు. విమానగోపురం స్వర్ణమయం చేయాలన్న ఆలోచన కేసీఆర్‌దేనని గుర్తుచేశారు. స్వర్ణతాడపంలో ప్రజలను భాగస్వాములు చేయాలన్న సంకల్పంతో విరాళాల సేకరణకు కూడా శ్రీకారం చుట్టారని తెలిపారు. అప్పట్లోనే చాలామంది దాతలు విరాళాలు అందజేశారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఎవరెవరు ఎంత విరాళం ఇచ్చారో ఈఓ స్పష్టమైన ప్రకటన చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రోడ్డు విస్తరణలో నష్టపోయిన 140 మంది బాధితులకు 60 షాపులను కేటాయించామన్నారు. ఆ షాపులకు నేటికీ విద్యుత్‌తోపాటు ఇతర మౌలిక వసతులను కల్పించలేకపోవడం దారుణమన్నారు. ఎంట్రీ ఫ్లైఓవర్ నిర్మాణం పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. కల్యాణకట్టలో స్థానికులకు న్యాయం జరుగలేదని, ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు ఉద్యోగాలను కట్టబెట్టారని తెలిపారు. టెంపుల్ సిటీపై డోనర్ కాటేజీలను నిర్మించాలని లేఅవుట్ చేస్తే కనీసం నిర్మించాలన్న ఆలోచన సీఎం, మంత్రి, ఎమ్మెల్యేకు రావడం లేదని విమర్శించారు. స్వామివారిపై సీఎం రేవంత్‌రెడ్డికి భక్తి లేదని, మొక్కుబడిగా వచ్చిన్నట్టు ఆయన పర్యటన కనిపించిందని తెలిపారు. ఆదాయాన్ని పెంచాలంటే విస్తృత ప్రచారం అవసరమని, గుట్టపై ఎందుకు ప్రచారం చేయడం లేదో ఈఓ చెప్పాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేకుండా పోయిందన్నారు. రాబోయే ఉత్సవాల్లో ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడబోయిన కాటంరాజు, మాజీ కౌన్సిలర్ బూడిద సురేందర్, బీఆర్‌ఎస్ పట్టణ నాయకుడు ఆరే శ్రీధర్‌గౌడ్, ఎండీ యాకుబ్ పాల్గొన్నారు.



తుంగతుర్తిలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, రైతులు

## సన్న ధాన్యం బోనస్ వెంటనే ఇవ్వాలి

- తుంగతుర్తిలో రైతులతో కలిసి బీఆర్‌ఎస్ ధర్నా

తుంగతుర్తి, ఫిబ్రవరి 24 : సన్న ధాన్యానికి బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ సన్నధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేసినా నెలలు గడుస్తున్నా అందించకపోవడం అన్యాయమన్నారు. సర్కారు తీరుతో నేరుగా మిల్లులకు అమ్ముకున్నా బాగుండేదని రైతులు బాధపడుతున్నారని తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా చివరి భూములకు గోదావరి జలాలు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుభరోసా, రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీటీసీ ఆంగోతు నరేశ్, మాజీ సర్పంచ్‌లు లకావత్ యాకునాయక్, గుగులోతు వీరోజీ, కొండగడుపుల నాగయ్య, మట్టిపల్లి వెంకట్, జటంగి రవి, గోపగాని శ్రీను, దుర్గయ్య, వెంకటేశ్, సాయికిరణ్, మల్లేష్, పూర్ణనాయక్, కడారి దాసు, లక్ష్మమ్మ, శ్రీకాంత్, ఉప్పల నాగమల్లు, మహేందర్ పాల్గొన్నారు.

## ఉపాధి ఉన్నచోట పునరాసం కల్పించాలి

- రెండోరోజూ లక్ష్మణాపురం భూనిర్వాసితుల ఆందోళన
- లక్ష్మణాపురం ప్రాజెక్టు పనుల అడ్డగింత



ఇరిగేషన్ అధికారులు, పోలీసులకు గోడు వెల్లబోసుకుంటున్న లక్ష్మణాపురం భూనిర్వాసితులు

మర్రిగూడ(నాంపల్లి), ఫిబ్రవరి 24 : భూములను కోల్పోయి నిర్వాసితులుగా మారిన తమకు ఉపాధి అవకాశాలు ఉన్న చోట పునరావాసం కల్పించాలని లక్ష్మణాపురం ప్రాజెక్టు ముంపు బాధితులు డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ప్లాట్లను కేటాయించి కోరారు. ఈ మేరకు రెండో రోజు సోమవారమూ లక్ష్మణాపురం ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు. తమకు న్యాయం జరిగే వరకు పనులు జరగనివ్వబోమంటూ ఇరిగేషన్ అధికారులతో వాగ్వాదానికి దిగా రు. ముంపు బాధితులందరికీ ఇబ్రహీంపట్నంలో ప్లాట్లు కేటాయిస్తామంటూ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ మేరకు అర్హులందరికీ ప్లాట్లు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన విరమింపజేశారు.

## రిజిస్టర్ నిర్వహణ లోపంపై కలెక్టర్ సీరియస్

- డిప్యూటీ తాసీల్దార్ కల్పనకు మెమో



తుర్కపల్లి తాసీల్దార్ కార్యాలయంలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లి, ఫిబ్రవరి 24 : కోర్టు కేసు రిజిస్టర్ సక్రమంగా నిర్వహించడం లేదని తుర్కపల్లి డిప్యూటీ తాసీల్దార్ కల్పనపై కలెక్టర్ హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు మెమో జారీ చేశారు. మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం, జడ్పీహెచ్‌ఎస్, మాధాపురం పల్లె దవాఖానను సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి, తాసీల్దార్ దేశ్యాతో పాటు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రిజిస్ట్రేషన్‌తో పాటు వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మీసేవ దరఖాస్తులు, కుల ధ్రువీకరణ, కల్యాణలక్ష్మి వంటి సేవలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రిజిస్టర్ సక్రమంగా నిర్వహించక విధుల్లో నిర్లక్ష్యం వహించిన డీటీ కల్పనపై సీరియస్ అయ్యారు. అదే విధంగా జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు స్వయంగా వడ్డించి వారితో కలిసి తిన్నారు.



ఆత్మకూరు(ఎం) సంతలో కేసీఆర్ పాలన గురించి చర్చించుకుంటున్న చిరువ్యాపారులు

## కేసీఆర్ పాలనే బాగుండె

- బక్కమల్లయ్యకుంట అంగడిలో చిరువ్యాపారుల చర్చ

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 24 : నలుగురు ఒక్కచోట చేరారంటే ఏదో ఒక విషయం మాట్లాడుకోవడం సహజం. మండల కేంద్రంలోని బక్కమల్లయ్యకుంటలో సోమవారం నాటి అంగడిలోనూ ఓ నలుగురు చిరువ్యాపారుల మధ్య ఆసక్తికరమైన చర్చ నడిచింది. ఇక్కడ వారం వారం అంగడి జరుగుతుంది. కాగా.. ప్రస్తుతం గిరాకీ లేదని, కేసీఆర్ పాలనలో గిరాకీ బాగా ఉండేదని, వ్యాపారం జోరుగా సాగేదని అంగడికి వచ్చిన వ్యాపారులు ఒక్కచోట కూర్చుని మాట్లాడుకోవడం కనిపించింది.

నాడు వివిధ జిల్లాల నుంచి అంగడికి వచ్చే వ్యాపారులు సాయంత్రం జేబు నిండా డబ్బుతో ఇంటికి వెళ్లేవారని, ఇంటిల్లిపాది సంతోషంగా ఉండేదని మాట్లాడుకున్నారు. అప్పట్లో పంటలు బాగా పండి రైతులు, రైతు కూలీలు ఆర్థికంగా మెరుగ్గా ఉండడంతోపాటు అన్ని వ్యాపారాలు బాగా నడిచేవని, దాంట్లో జనం దగ్గర కూడా డబ్బులు ఉండేవని చెప్పుకొచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతా గందరగోళంగా ఉందని, ఏ ఒక్కటీ బాగాలేదని, వ్యాపారాలు సాగడం లేదని విచారం వ్యక్తం చేశారు.

## సభ్యత్వం కోసం పీఏసీఎస్ ఎదుట రైతు నిరసన



గుండాల పీఏసీఎస్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతు భిక్షం

గుండాల, ఫిబ్రవరి 24 : తనకు గుండాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో సభ్యత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బండకొత్తపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌దాస్ భిక్షం సోమవారం పీఏసీఎస్ ఎదుట నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా భిక్షం మాట్లాడుతూ పీఏసీఎస్‌లో తనకు సభ్యత్వం ఇవ్వాలని ఏడాది కాలంగా తిరుగుతున్నా సీఈఓ నాగయ్య సభ్యత్వం ఇవ్వడం లేదని, డీసీఓ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారని ఆరోపించారు. పీఏసీఎస్‌లో రుణం తీసుకుంటేనే సభ్యత్వం ఇస్తానని ఇబ్బంది పెడుతున్నారని రైతు తెలిపాడు. ఈ విషయమై యాదాద్రి డీసీఓ శ్రీధర్ మాట్లాడుతూ పంట రుణం తీసుకోక పోయినా వ్యవసాయ భూమి కలిగి ఉంటే వాటా ధనం చెల్లించి సభ్యత్వం పొందవచ్చన్నారు. భిక్షం అర్హతను పరిశీలించి సభ్యత్వం కల్పిస్తామని తెలిపారు.




చౌటుప్పల్‌లో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

## ఆంధ్రా పాలకుల చేతిలో తెలంగాణ ప్రభుత్వం

- మన నీళ్లను తరలించుకుపోతున్నా పట్టించుకోని జిల్లా మంత్రులు
- కేసీఆర్ పాలనలో సాగు, తాగునీటి ఎద్దడి నేడు ఎందుకు వచ్చాయ్?
- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 24 : ఆంధ్రా పాలకుల చేతిలో తెలంగాణ ప్రభుత్వం కీలుబొమ్మలా మారిందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ పట్టణ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కృష్ణా వాటర్ బోర్డు కేంద్రానికి అప్పగించకుండా తెలంగాణ వాటాను నిక్కచ్చి వాడుకొని నల్లగొండ ప్రజలకు సాగు, తాగు నీటిని అందించారన్నారు. ప్రస్తుతం ఆంధ్రా పాలకులు యథేచ్ఛగా నీటిని తరలించుకుపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం, నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు దిష్టిబొమ్మలా చూస్తు ఊరుకుంటున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలో లేని తాగు, సాగు నీటి కొరత నేడు ఎందుకొచ్చాయో ప్రజలు ఆలోచించాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలే గాక అనేక నూతన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతలు మాత్రం ఇచ్చిన హామీలు నెరవేర్చమంటే తప్పించుకు తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. చౌటుప్పల్ పట్టణంలో జరిగిన అబివృద్ధి పనులు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన నిధులతోనే జరుగుతున్నాయని, ప్రస్తుత ఎమ్మెల్యే ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నివిధాలుగా వేధిస్తున్నా సైనికుల్లా నిలబడి పోరాడుతున్నారని చెప్పుకొచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దింటి బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గిర్కాటి నిరంజన్‌గౌడ్, గునమోని వెంకటేశం, చౌటుప్పల్ మాజీ కార్పొరేటర్ తాడూరి శిరీషాపరమేశ్, ఉడుగు మల్లేశం, డిల్లీ మాధవరెడ్డి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలు